క్లుప్తంగా

రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణంలో, మండల పరిధిలోని ఎర్రంరెడ్డిపల్లె, మల్లికార్జునపురం ప్రాంతాలలో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈలు జగదీశ్వరరెడ్డి, మురళీకృష్ణలు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సబ్‌స్టేషన్లలో మెయింటెన్స్ కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని.. వినియోగదారులందరూ సహకరించాలని వారు కోరారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

ముద్దనూరు : మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రమణారెడ్డి తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో నేటి ఉదయం 10.30 గంటల నుంచి ఎంపీపీ అధ్యక్షతన ఈ సమావేశం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

15న బహిరంగ వేలం

వేంపల్లె : పాపాఘ్ని నది ఒడ్డున వెలసిన శ్రీలక్ష్మీవృషభాచలేశ్వరస్వామి దేవస్థాన కల్యాణ మండపంలో ఈనెల 15వ తేదీన సోమవారం ఉదయం 11 గంటలకు తలనీలాలు ప్రోగు చేసుకునే హక్కుకు గానూ, అలాగే ఉదయం 12 గంటలకు శ్రీవృషభాచలేశ్వర కల్యాణ మండపం లీజుకు ఇచ్చేందుకు బహిరంగ వేలం నిర్వహించనున్నామని ఆలయ ఈఓ శ్రీధర్, ఆలయ పాలక మండలి చైర్మన్ వెంకటేష్‌లు తెలిపారు. ఈ వేలంపాట దేవదాయ శాఖ అధికారుల సమక్షంలో ఉంటుందన్నారు. ఈ వేలంపాటలో హిందువులు మాత్రమే పాల్గొనాలన్నారు. మరిన్ని వివరాలకు దేవస్థాన కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

15 నుంచి ఇంటర్ అడ్మిషన్లు ప్రారంభం

సింహాద్రిపురం : స్థానిక వైఎస్ రాజారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల 15వ తేదీ సోమవారం నుంచి ఇంటర్ అడ్మిషన్లు ప్రారంభించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ భాస్కర్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన తెలుపుతూ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈసీ, సీఈసీ గ్రూపులకు సంబంధించి తెలుగు, ఇంగ్లీషు మీడియంలకు దరఖాస్తులు చేసుకోవచ్చునన్నారు.

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్

పులివెందుల రూరల్ : మండలంలోని ఎర్రబల్లె దళితవాడ గ్రామంలో దివంగత తొండూరు వెంగల్‌రెడ్డి జ్ఞాపకార్థం నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ గురువారం ముగిసింది. ఈ ముగింపు కార్యక్రమానికి ఏపీఎం ఆంజనేయులు హాజరై క్రికెట్ టోర్నీ విజేతగా నిలిచి హీర్క్‌లైన్ లెవెన్ జట్టుకు రూ.5వేల నగదుతోపాటు మెమెంటోను అందించారు. అలాగే రన్నర్ జట్టుకు రూ.2వేల నగదు, మెమెంటోను అందించారు. కార్యక్రమంలో రామచంద్ర, శేఖర్, హేమంత్‌కుమార్, యువకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

చింతకొమ్మదిన్నె : స్థానిక గ్రంథాలయంలో సమ్మర్ క్యాంప్‌లో భాగంగా గురువారం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలను గ్రంథాలయ అధికారి ఇబ్రహీం నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేస్తామన్నారు.

అసత్య ఆరోపణలు చేయడం తగదు

కమలాపురం : కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్‌పై టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అసత్య ఆరోపణలు చేయడం తగదని మైనార్టీ కమిషన్ బోర్డు మెంబర్ హిదాయత్ పేర్కొన్నారు. గురువారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈనెల 7వ తేదీన కర్నూలులో జరిగిన కార్యక్రమంలో నారా లోకేష్, కర్నూలు నగర ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్‌పై వక్ఫ్ భూముల్లో అక్రమాలు చేశారని అసత్య ఆరోపణలు చేయడం తగదన్నారు. ఇప్పటికే ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్ మీరా లోకేష్‌పై చర్యలు తీసుకోవాలని మా కమిషన్ చైర్మన్ కె.ఇక్బాల్‌అహ్మద్‌ఖాన్‌కు ఫిర్యాదు చేశారన్నారు.

వైన్‌షాపు మార్పుపై మహిళల హర్షం

కలసపాడు : మండల కేంద్రమైన కలసపాడులోని స్టేట్‌బ్యాంక్ ఎదురుగా ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణాన్ని ఎక్సైజ్ అధికారులు గురువారం గిద్దలూరు రోడ్డులోని సగిలేరు బ్రిడ్జి సమీపంలో ఏర్పాటు చేశారు. గతంలో స్టేట్ బ్యాంకుకు ఎదురుగా మద్యంషాపు ఉండటంతో మహిళలు ఇబ్బందులు పడుతుండేవారు. గతంలో పలుమార్లు ప్రజా సంఘాల నాయకులు వైన్‌షాపును మార్పు చేయాలని ఆందోళనలు చేపట్టారు. స్థానిక ఎస్ఐ నాగమురళి చొరవతో స్టేట్‌బ్యాంకు ఎదురుగా ఉన్న మద్యం దుకాణాన్ని సగిలేరు బ్రిడ్జి వద్దకు మార్పు చేయడంతో మహిళలు హర్షం వ్యక్తం చేశారు.

హెచ్ఆర్ఏ పెంపుపై హర్షం

రాజుపాళెం : కొత్త జిల్లా కేంద్రాలలో ఇంటి అద్దె, అలవెన్సు 16 శాతానికి పెంచడంపై ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శేఖర్, వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామసుబ్బయ్య, సీవీ ప్రసాద్, ఆలీఖాన్, చంగలరెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి



ప్రజలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి

చింతకొమ్మదిన్నె : ప్రజల సంక్షేమమే జగనన్న ప్రభుత్వ ధ్యేయమని కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్ రెడ్డి, సీకేదిన్నె జడ్పీటీసీ పి.నరేన్ రామాంజులురెడ్డిలు తెలిపారు. గురువారం 18వ డివిజన్ పరిధిలోని బయనపల్లె, ఏఎల్ కాలనీ, మూలవంక గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. కులం, మతం, పార్టీ చూడకుండా అర్హతే ప్రామాణికంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్ళుగా భావించి పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల గుండెల్లో నిలిచిపోయారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ బండి నిత్యానందరెడ్డి, కడప మార్కెట్ యార్డు చైర్మన్ బంగారు నాగయ్యయాదవ్, మండల కన్వీనర్ గూడ ప్రభాకర్‌రెడ్డి, కో-కన్వీనర్ కళాయాదవ్, మాజీ కన్వీనర్ గుత్తి రెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఈడిగ కార్పొరేషన్ డైరెక్టర్ కృష్ణయ్య, 17వ డివిజన్ కార్పొరేటర్ చంద్రహాసరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, 16వ డివిజన్ ఇన్‌చార్జి నాగిరెడ్డి ప్రసాద్‌రెడ్డి, ఎంపీటీసీలు వెంకటరెడ్డి, నాగరాజు, సర్పంచులు సురేంద్రారెడ్డి, మల్లికార్జున యాదవ్, సుబ్బరాయుడు, సింగిల్ విండో అధ్యక్షులు రాజారెడ్డి, గజ్జల శ్రీరామిరెడ్డి, నాయకులు శ్రీనివాసులురెడ్డి, రామచంద్రారెడ్డి, గజ్జల ఈశ్వరెడ్డి, చిన్నసిద్దయ్య, అప్పానాయక్ తదితరులు పాల్గొన్నారు.

కాలువలపై ఇళ్ల నిర్మాణాలు చేపట్టవద్దు



నిర్మాణాలను పరిశీలిస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి

పులివెందుల టౌన్ : మున్సిపాలిటీ పరిధిలోని కాలనీలలో ప్రజలు ఇళ్ల వద్ద ముందుకు సాగి నిర్మాణాలు కానీ, కాలువలపై నిర్మాణాలు చేపట్టడం సరి కాదని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలోని వాసవీ కాలనీ, చిన్నకొండారెడ్డి కాలనీల్లో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డిలతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన కాలువలపై కట్టిన ఇళ్ల నిర్మాణాలను చూసి ప్రజలు అవగాహన కల్పించారు. ఇళ్ల వద్ద ముందుకు సాగి నిర్మాణాలు, కాలువలపై నిర్మాణాలు చేపట్టడం సరి కాదని.. అటువంటి నిర్మాణాలను కచ్చితంగా కూలిపేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి అజయ్‌కుమార్, అసిస్టెంట్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

ఎరువులను అందుబాటులో ఉంచాలి



మాట్లాడుతున్న జిల్లా అధికారి నాగేశ్వరరావు

వేంపల్లె : ప్రతి రైతు భరోసా కేంద్రాలలో రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉంచాలని జిల్లా వ్యవసాయ సంచాలకులు నాగేశ్వరరావు ఆర్‌బీకే సిబ్బందికి ఆదేశించారు. వ్యవసాయశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు వేంపల్లెలోని రైతు భరోసా కేంద్రాలను ఆయన సందర్శించారు. గురువారం స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో 18 ఆర్‌బీకేల సిబ్బందితో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించి ఆర్‌బీకేల యొక్క పనితీరును ఏఓను అడిగి తెలుసుకున్నారు. ఆర్‌బీకే ఇన్‌చార్జిలను వచ్చే ఖరీఫ్ సాగుకు సమాయత్తం కావాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఎం కిసాన్, ఈకేవైసీ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అనంతరం ఆర్‌బీకే సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఓ రాజేంద్రప్రసాద్, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

లోకాస్ యాప్‌పై శిక్షణ తరగతులు

సింహాద్రిపురం : స్థానిక మహిళా మండలి సమాఖ్య కార్యాలయంలో గురువారం ఏపీఎం మంజునాథ ఆధ్వర్యంలో వీఓలకు లోకాస్ యాప్‌పై శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ గతంలో కేంద్ర ప్రభుత్వం ఎన్ఆర్ఎల్ఎం విధానంలో మహిళా సంఘాల సభ్యుల యొక్క సమాచారాన్ని యాప్‌లో నిక్షిప్తంచేయడానికి మూడు రోజులపాటు శిక్షణ తరగతులు ఉంటాయని.. ఈ శిక్షణ గతంలో ఏబీకే ద్వారా సమాచారం సేకరించేవారు. దీనిలో పూర్తి సమాచారం రావడంలేదని గుర్తించి ఇప్పుడు లోకాస్ యాప్ ద్వారా సంఘం పూర్తి సమాచారం నమోదు చేయడానికి అవకాశం ఉంది. కాబట్టి దీనిపై ఈ శిక్షణ ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో సీసీలు, గ్రామ సమాఖ్య అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఆహార, వ్యవసాయ విజ్ఞానంపై ముగిసిన శిక్షణ



విదేశీ శిక్షణకు ఎంపికైన విద్యార్థినులు

పులివెందుల టౌన్ : పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని ఆహార విజ్ఞాన శాస్త్ర మరియు సాంకేతిక కళాశాల విద్యార్థినులు విదేశీ శిక్షణను విజయవంతంగా ముగించారు. ఈ సందర్భంగా విద్యార్థులు విదేశాలలో ఆహార ఉత్పత్తుల తయారీలో ఆచరిస్తున్న విధానాలు, పరిశోధనలలో భాగస్వామ్యులై తమ అనుభవాలను వారితో పంచుకున్నారు. కళాశాల నుంచి నలుగురు విద్యార్థినులు కార్యక్రమానికి ఎంపికయ్యారు. విద్యార్థినులు జోతిర్మయి దుబాయ్‌లోని ఐసీబీఏకి, ఎం.హేమావతి అమెరికాలోని కెన్సిస్ స్టేట్ యూనివర్శిటీకి, ఎస్ఆర్ ఫిన్‌లాండ్‌ని టాంపియన్ విశ్వవిద్యాలయానికి, వీఎం జాహ్నవి మలేసియాలోని యుఎంకే యూనివర్శిటీకి శిక్షణ కోసం ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థినులు మాట్లాడుతూ ఈ శిక్షణలో ల్యాబ్‌లో చిన్న మొక్కలను పెంచి వాటిని భూమిలో నాటడం వరకు ఏ విధంగా జాగ్రత్తలు తీసుకోవాలనేది నేర్చుకున్నామని.. ప్లాంట్ టిష్యూకల్చర్ గురించి ఎంతో నేర్చుకున్నామని, ఈ శిక్షణ ఎంతో ఉపయోగపడిందన్నారు.

కుష్టు వ్యాధిగ్రస్తులు జాగ్రత్తలు తీసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న జిల్లా ఎన్‌సీడీ మెడికల్ ఆఫీసర్ భరత్

వల్లూరు : కుష్టు వ్యాధి గ్రస్తులు తగిన జాగ్రత్తలను తీసుకోవాలని జిల్లా ఎన్‌సీడీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ భరత్ తెలిపారు. జిల్లా పారా మెడికల్ ఆఫీసర్ నాగన్న, ఫిజియో థెరపిస్ట్ విక్టర్ మనోహర్, డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ వీరభద్రయ్యతో కలిసి గురువారం ఆయన వల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం అంగవైకల్య నివారణ, వైద్య పునరావాసం కార్యక్రమంలో భాగంగా కుష్టువ్యాధి గ్రస్తులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కుష్టువ్యాధితో అంగ వైకల్యం కలిగిన వారు ప్రతి రోజు కాళ్లు, చేతులు నీటిలో నానబెట్టి, వాటిని శుభ్ర పరుచుకోవడంతో పాటుగా నూనెతో మర్దన చేసుకోవాలని సూచించారు. గాయాలు వున్న వ్యాధిగ్రస్తులు వాటిని శుభ్ర పరిచి పూత మందులను వాడాలన్నారు. వైద్య సిబ్బంది క్రమం తప్పకుండా ప్రతినెలా వారికి టీబీ కార్యక్రమ సర్వేను నిర్వహించాలన్నారు. మూడు వారాలకు పైగా దగ్గు, జ్వరంతో బాధ పడుతున్న వారిని గుర్తించి గళ్ల పరీక్షలు నిర్వహించాలని సూచించారు. ముఖ్యంగా పరిశ్రమలు, ఇటుకల బట్టీల వద్ద వుండే క్షయవ్యాధి వున్న కుటుంబాలను గుర్తించి పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. ఆశ కార్యకర్తలు ప్రతి రోజు 10 గృహాలను సందర్శించి కుష్టు, క్షయ వ్యాధి సర్వేలను నిర్వహించి నివేదికలను జిల్లా కేంద్రానికి పంపాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు ప్రసన్నలక్ష్మి, ఫణీంద్ర, సీహెచ్‌వో వేణుగోపాల్, పీహెచ్ఎన్ నిర్మల, హెల్త్ సూపర్ వైజర్ మమత, స్టాఫ్ నర్స్ ఉమ తదితరులు పాల్గొన్నారు.

స్థానికత ఉనికిని తెలిపే మాండలికం



పుస్తకావిష్కరణలో అతిథులు

కడప కల్చరల్ : మాండలికంతో స్థానికత ఉనికి తెలుస్తుందని, భాషకు పరిపుష్టత లభిస్తుందని రచయిత గజేంద్రనాథ్‌రెడ్డి బద్వేలు ప్రాంత మాండలికంతో రాసిన కథలు తెలుగుభాష ఉన్నతిని తెలిపేలా ఉన్నాయని వక్తలు పేర్కొన్నారు. హైదరాబాదుకు చెందిన లలిత కళాభిరామ ఫించము సంస్థ, స్థానిక రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ సౌజన్యంతో గురువారం సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో ఎలిచర్ల గజేంద్రనాథ్‌రెడ్డి రచించిన నాసీమ యాసే నా శ్వాస కథా సంపుటి పరిచయ సభ జరిగింది. ముందుగా అతిథులు పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఇంటాక్ జిల్లా కన్వీనర్ చిన్నపరెడ్డి , సభాధ్యక్షులు మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ మాతృభాష అమ్మలాంటిదన్నారు. భాషా పుష్పగల గజేంద్రనాథ్‌రెడ్డి తన రచనలో భాషతోపాటు భావ పరిణితిని సాధించారన్నారు. విశిష్ఠ అతిథి డాక్టర్ ఎలిచర్ల శివానందలహరిరెడ్డి, ఆత్మీయ అతిథి వివేక్ లంకమల మాట్లాడుతూ గజేంద్ర తన అనుభవాలకు మాండలిక పరిమళం అద్ది రచనలో తన ప్రత్యేకతను చాటుకున్నారన్నారు. వైవీయూ చిత్రకళావిభాగం అధిపతి డాక్టర్ కోట మృత్యుంజయరావు, గౌరవ అతిథి, రాష్ట్ర అధికారభాషా సంఘం సభ్యులు డాక్టర్ తవ్వా వెంకటయ్య మాట్లాడారు. కళారత్న, శిల్పి గొల్లపల్లి జయన్న ఆధ్వర్యంలో 'నా సీమ యాస' పుస్తక సమీక్ష నిర్వహించారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

చింతకొమ్మదిన్నె : నగర పరిధిలోని 18వ డివిజన్ సాయినగర్, విశ్వనాథపురం గ్రామాల్లో శుక్రవారం జరిగే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి పాల్గొంటారని మండల కన్వీనర్ గూడా ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. మండలస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని ఆయన కోరారు.

నేడు చిలంకూరు గ్రామంలో..

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని చిలంకూరు గ్రామంలో శుక్రవారం సాయంత్రం 3 గంటలకు జరిగే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ ఎం. సుధీర్‌రెడ్డి పాల్గొంటారని వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి ఎం.సురేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని ఆయన తెలిపారు.

115 క్వింటాళ్ల జీలుగలు మంజూరు

వల్లూరు : మండలానికి 115 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు మంజూరయ్యాయని మండల వ్యవసాయ శాఖ అధికారి సాయిజ్యోతి ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా రైతు భరోసా కేంద్రాల ద్వారా వాటిని పంపిణీ చేయనున్నట్లు ఆమె తెలిపారు. మండలంలో ఖరీఫ్‌లో వరి పంట సాగుచేసే రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. విత్తనాలు కావాల్సిన రైతులు పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు, సెల్ నెంబరును తీసుకుని మీ పరిధిలోని రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి బయో మెట్రిక్ ద్వారా నమోదు చేసుకోవాలని తెలిపారు. జీలుగలు 10 కిలోల బ్యాగు పూర్తి ధర రూ.790 కాగా 50 శాతం ప్రభుత్వ సబ్సిడీ పోనూ రైతులు రూ.395 చెల్లించి విత్తనాలను పొందవచ్చునని ఏఓ తెలిపారు.

లింగాల తహసీల్దార్‌గా లక్ష్మీనారాయణ



లింగాల : మండల తహసీల్దార్‌గా లక్ష్మీనారాయణ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈయన వేముల మండల తహసీల్దార్‌గా పనిచేస్తుండగా.. ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న శేషారెడ్డి వేములకు బదిలీ అయ్యారు. లింగాల మండల తహసీల్దార్‌గా లక్ష్మీనారాయణ బాధ్యతలు చేపట్టి సిబ్బందిని పరిచయం చేసుకున్నారు.

మహనీయుల జీవితాలను స్ఫూర్తిగా తీసుకోవాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : మహనీయుల జీవితాలను స్ఫూర్తిగా తీసుకోవాలని విశ్రాంత తెలుగు పండితుడు వీఎం భాస్కర్ రాజు విద్యార్థులకు సూచించారు.

స్థానిక వసంతపేటలోని మున్సిపల్ హైస్కూల్‌లో రామేశ్వరం బాలబాలికల గ్రంథాలయం ఆధ్వర్యంలో విద్యార్థులకు వేసవి శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా భాస్కర్ రాజు మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని క్రమశిక్షణ, పట్టుదలతో సాధించాలని చెప్పారు. జిరాఫీ చెస్ కోచ్ అరవింద్, తేజస్ విద్యార్థులకు జిరాఫీ చెస్ ఎలా ఆడాలో నేర్పించారు. యోగా టీచర్లు శ్రావణి, వెంకటసుబ్బమ్మ యోగాసనాలు నేర్పించారు. గ్రంథాయ రికార్డు అసిస్టెంట్ ఇబ్రాం సాహెబ్, రచయిత డీకే చదువుల బాబు, రెహ్మాన్ ఖాన్, శారద పాల్గొన్నారు.

ఘనంగా బండలాగుడు పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

జమ్మలమడుగు : ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ఒంగోలు జాతి ఎద్దుల బండలాగుడు పోటీలను నారాపురస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా స్థానిక పతంగేరామన్నరావు క్రీడా మైదానంలో గురువారం ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నేడు ఒంగోలు జాతి ఎద్దులు చాలా వరకు కనుమరుగవుతున్నాయన్నారు. కొంత మంది రైతులు ఒంగోలు జాతి ఎద్దులను ఖర్చులకు వెనుకాడకుండా వాటిని సంరక్షించడం శుభపరిణామం అన్నారు. ఈ పోటీల్లో నంద్యాల జిల్లా పెద్దకొట్టాల గ్రామానికి చెందిన బోరెడ్డి కేశవరెడ్డి ఎద్దు ప్రథమ స్థానం సాధించగా ద్వితీయస్థానం రాష్ట్ర ఆర్థికమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డికి చెందిన ఎద్దు సాధించాయి. మొదటి స్థానంకు రూ.80 వేలు, రెండవస్థానంకు రూ.60 వేలు, 3వ స్థానంకు రూ.50వేలు నగదును మున్సిపల్ చైర్‌పర్సన్ వేల్పుల శివమ్మ వారికి అందజేశారు. పోటీలను తిలకించటానికి వచ్చిన వారికి వైఎస్సార్‌సీపీ నాయకుడు హృషికేశవరెడ్డి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జి.ఈశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత లోపించకూడదు



నూతన భవన నిర్మాణాలను పరిశీలిస్తున్న వైఎస్ కొండారెడ్డి

చక్రాయపేట : మండలంలో జరిగే అభివృద్ధి పనుల్లో ఎక్కడేగాని నాణ్యతా ప్రమాణాలు లోపించకూడదని చక్రాయపేట మండల ఇన్‌చార్జి వైఎస్ కొండారెడ్డి తెలిపారు. గురువారం ఆయన చక్రాయపేటలో రూ.4 కోట్లతో జరుగుతున్న తహసీల్దారు కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయ నూతన భవన నిర్మాణ పనులను పరిశీలించి మాట్లాడారు. ఎక్కడకూడా నాణ్యత లోపించకుండా చూడాలని కాంట్రాక్టర్ హేమసుందరరెడ్డికి సూచించారు. ముఖ్యమంత్రి జగనన్న జిల్లాలో ఎక్కడేగాని లేనివిధంగా చక్రాయపేటలో నూతన తహసీల్దారు కార్యాలయ నిర్మాణం కోసం నిధులు మంజూరు చేశారన్నారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న మండల మాజీ ఉపాధ్యక్షుడు, వైఎస్ఆర్‌సీపీ సీనియర్ నాయకుడు చిలేకాంపల్లెకు చెందిన బెల్లం కృష్ణారెడ్డిని పరామర్శించారు.అలాగే చిలేకాంపల్లెలో నాలుగు రోజుల క్రితం విద్యుత్ ప్రమాదంలో మృతి చెందిన రామకృష్ణారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఇడుపులపాయలోని వైఎస్ఆర్ అతిథి గృహంలో పార్టీకి చెందిన కార్యకర్తలు, నేతలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. చిలేకాంపల్లెకు చెందిన పార్టీ నేత ఆదిరెడ్డి కుమారుడు మహేశ్వరరెడ్డి, శ్రీవాణిల వివాహానికి, అలాగే పాయలోపల్లెకు చెందిన వైద్యుడు సాయిప్రతాప్ కళ్యాణిల వివాహానికి హాజరై వధూ వరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఎంపీపీ మాదవీ బాలకృష్ణ, మండల సమన్వయకర్త ఓబుళరెడ్డి, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు వెంకటసుబ్బయ్య, సింగిల్ విండో అధ్యక్షుడు శేషారెడ్డి, గండి పాలక మండలి సభ్యుడు రామాంజులరెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు వర్ధన, పార్టీ నేతలు రామచంద్రారెడ్డి, జనార్ధనరెడ్డి, కిరణ్‌కుమార్ రెడ్డి, అంజలిరెడ్డి, మల్లికార్జునరెడ్డి, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సుంకులమ్మ బ్రహ్మోత్సవాలు



సుంకులమ్మ ఆలయం

కమలాపురం : పట్టణంలోని పడమట వీధి సమీపంలోని చెరువుగట్టుపై వెలసిన వజ్రాల (వరాల) సుంకులమ్మతల్లి అష్టమ బ్రహ్మోత్సవాలు శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

13, 14 తేదీలలో బండలాగుడు పోటీలు :

శ్రీ వరాల సుంకులమ్మ తిరునాల సందర్భంగా ఈనెల 13వ తేదీన ఆరుపళ్ల విభాగం ఎద్దులకు బండలాగుడు పోటీలు నిర్వహించనున్నారు. గెలుపొందిన విజేతలకు వరుసగా రూ.50వేలు, రూ.40వేలు, రూ.30 వేలు, రూ.20వేలు, రూ.10వేలు, రూ.5 వేలు నగదు బహుమతులు అందజేయనున్నా రు. అలాగే 14వ తేదీన సీనియర్స్ విభాగం ఎద్దులచే బండలాగుడు పోటీలు నిర్వహించనున్నారు. వరుసగా రూ.1.5 లక్షలు, రూ.1 లక్ష, రూ.75 వేలు, రూ.50 వేలు, రూ.25వేలు, రూ.15 వేలు నగదు బహుమతులు ఇవ్వనున్నారు. అలాగే 22వ తేదీన న్యూ కేటగిరి ఎద్దులచే బండలాగుడు పోటీలు నిర్వహిస్తారన్నారు. విజేతలకు వరుసగా రూ.75వేలు, రూ.50వేలు, రూ.25వేలు, రూ.20వేలు, రూ.10 వేలు, రూ.5వేలు ఇవ్వనున్నారు. అలాగే శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి ముగ్గుల పోటీలు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. పోటీలో పాల్గొనే మహిళలు మెటీరియల్ వారే తెచ్చుకోవాలన్నారు. విజేతలకు వరుసగా రూ.5వేలు, రూ.4వేలు, రూ.3వేలు, రూ.2వేలు, రూ.వెయ్యి, రూ.500 నగదు బహుమతులు అందజేయనున్నట్లు వారు తెలిపారు.

నేడు చెవి, ముక్కు, గొంతు వైద్య నిపుణులు రాక

పులివెందుల : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(ఇసీ గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ఉదయం చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ వి.ప్రతాప్‌రెడ్డి చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్దములు, చెవిలో కర్ణభేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్‌ఫెక్షన్‌కు మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, తదితర వాటికి వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. అలాగే ఆసుపత్రిలో 24 గంటలు ఎండోస్కోపీ, కోలనోస్కోపీ పరీక్షలతోపాటు గ్యాస్ట్రబుల్ తీవ్రత తెలుసుకోవడం, చిన్నపిల్లలు నాణేలు, పిన్నులు, సూదులు, ముక్కలు మింగితే తీయడం జరుగుతుందని.. ఎసోఫజిల్ వెరిసెస్‌కు ఎండోస్కోనిక్ బాండిన చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 08568 286189, 9963 170177 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.


• కల్యాణం కమనీయం



భీమలింగేశ్వరస్వామి, సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

రాజుపాళెం : ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వెల్లాల గ్రామంలోని సంజీవరాయ కల్యాణ మండపంలో గురువారం సాయంత్రం వైభవంగా గంగాగౌరి సమేత భీమలింగేశ్వరస్వామి, సీతారాముల కల్యాణోత్సవాన్ని వేదపండితులు ఏకకాలంలో కన్నుల పండువగా నిర్వహించారు. నూతనంగా చేయించిన ఈ ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి కల్యాణ మండపంలో ఆశీనులను చేశారు. వేదపండితులు శాస్త్రోక్తంగా వేదమంత్రోచ్చారణలో మంగళవాయిద్యాలతో వైభవంగా కల్యాణాన్ని నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్‌పర్సన్ కానాల విజయలక్ష్మి, సర్పంచ కానాల రాధా, వైఎస్సార్‌సీపీ నాయకుడు బలరామిరెడ్డి, ఈఓ నరసయ్య ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. కల్యాణం అనంతరం భక్తులకు అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేశారు.

జగనన్న ఇళ్ల నిర్మాణాలను పూర్తిచేయండి



మాట్లాడుతున్న ఆర్డీఓ వెంకటేశ్వర్లు

సింహాద్రిపురం : మండల వ్యాప్తంగా జగనన్న ఇళ్ల నిర్మాణాలను వారంలో పూర్తి చేయాలని ఆర్డీఓ వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వీఆర్ఓలు, సచివాలయ సిబ్బందికి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆర్డీఓ హాజరై మాట్లాడుతూ రూఫ్ లెవెల్, శ్లాబ్ లెవెల్‌లో ఉన్న ఇంటి నిర్మాణాలను వారం రోజుల్లో పూర్తి చేయాలన్నారు. అలాగే సచివాలయ సిబ్బంది ప్రతిరోజు 3 గంటల నుంచి 5 గంటల వరకు స్పందన అర్జీలను స్వీకరించాలన్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ×జగనన్నకు చెబుదాం॰ సమస్యలను వచ్చిన 24 గంటల్లోనే పరిష్కరించాలని.. లేకుంటే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల స్పెషలాఫీసర్ నాగలింగాచారి, తహసీల్దార్ మహబూబ్‌బాషా, ఎంపీడీఓ కృష్ణమూర్తి, ఏపీఎం మంజునాథలు పాల్గొన్నారు.

ఎర్రగుంట్లలో..

ఎర్రగుంట్ల : జగనన్న కాలనీలలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణ పనులలో ఇచ్చిన టార్గెట్‌ను అనుకున్న సమయానికి పూర్తిచేయాలని ఆర్డీఓ శ్రీనివాసులు తెలిపారు. గురువారం ఎర్రగుంట్ల ఎంపీడీఓ సభా భవనంలో ఆయన గ్రామీణ అర్బన్‌లలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణ పనులపై సమీక్ష నిర్వహించి మాట్లాడారు. మున్సిపల్ పరిధిలోని ఇళ్ల పనులు చాలా ఆలస్యంగా జరుగుతున్నాయని ఒక్క ఆరో సచివాలయంలో మాత్రమే టార్గెట్‌ను పూర్తిచేస్తున్నారని మిగత సచివాలయ పరిధిలలో పూర్తి చేయకపోవడంతో వారిపై ఆగ్రహించారు. మున్సిపల్ పరిధిలో కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఇళ్ల నిర్మాణ పనులు చాలా ఆలస్యంగా జరుగుతున్నాయన్నారు. సచివాలయ సిబ్బందిపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి గురువారం సమీక్ష నిర్వహిస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎ.నాగేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ పి.జగన్నాథ్, ఎంపీడీఓ సూర్యనారాయణరెడ్డి, హౌసింగ్ ఏఈ రామకృష్ణ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ముద్దనూరులో..

ముద్దనూరు : పేదలకు ప్రభుత్వం మంజూరుచేసిన పక్కాగృహాలను లబ్ధిదారులు త్వరితగతిన పూర్తిచేయాలని రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాసులు తెలిపారు. గురువారం స్థానిక మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో జగనన్న లేఅవుట్‌లలో పక్కాగృహాల నిర్మాణ పురోగతిపై ఇన్‌చార్జి తహసీల్దారు శోభన్‌బాబు, ఎంపీడీఓ రమణారెడ్డిలతో కలసి ఆర్డీఓ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారం వారం సచివాలయ, డ్వాక్రా, హౌసింగ్ సిబ్బంది ఇళ్ల నిర్మాణాలో పురోగతి సాధించేలా చూడాలని, లక్ష్యాన్ని సాధించడానికి సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మండలంలో ఇళ్ల నిర్మాణాల వేగం పెంచాలని, దీనికి డ్వాక్రా రుణాలను సకాలంలో అందించాలని, ఇతర సమస్యలను పరిష్కరించి లబ్ధిదారులను చైతన్య పరచాలని ఆయన సూచించారు.